క్లుప్తంగా

టీఎన్జీవోస్ నేతలను కలిసిన అడ్‌హక్ కమిటీ

ఖమ్మంసహకారనగర్: టీఎన్జీవోస్ నేతలను బుధవారం అడ్‌హక్ కమిటీ కన్వీనర్, సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. అడ్‌హక్ కమిటీ కన్వీనర్ కొణిదెన శ్రీనివాస్, సభ్యులు జయపాల్, శ్రీధర్‌సింగ్ తదితరులు టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీష్, ముజీబ్, అసోసియేట్ అధ్యక్షులు ముత్యాల సత్యనారాయణగౌడ్, కస్తూరి వెంకటేశ్వరరావులను కలిశారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

నేలకొండపల్లి: సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై పి.సంతోష్ అన్నారు. ఈమేరకు మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉంటూ తెలియని మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. నేరాలబారిన పడితే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కామేపల్లి: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి నెల్లూరి చందన అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంవన్‌టౌన్: ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అమేర్ అలీఖాన్‌ను హైదరాబాద్‌లో బుధవారం సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జావీద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జావీద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి ముస్లిం మైనార్టీల పట్ల సానుకూల వైఖరితో వ్యవహరిస్తుందని, మైనార్టీల సమస్యలపై ఎంతో అవగాహన కలిగిన అమేర్‌అలీఖాన్ ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఎంపీ పరామర్శ

ఖమ్మంవన్‌టౌన్: పితృవియోగంతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ నాయకుడు మహ్మద్ ముస్తఫా, ఆయన సతీమణి కార్పొరేటర్ రఫీదాబేగంను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి బుధవారం సాయంత్రం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మిక్కిలినేని నరేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

కామేపల్లి: తెలంగాణ ఓపెన్ స్కూల్ అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుధాకర్ చేతుల మీదుగా గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ మద్దినేని పాపారావు, కో ఆర్డినేటర్ అమిరినేని దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు, సాక్సులు వితరణ



బూట్లు అందిస్తున్న విజయ్‌కుమార్

ఖమ్మంరూరల్: మండలంలోని చింతపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి పగిళ్ల విజయ్‌కుమార్ బుధవారం బూట్లు, సాక్సులు వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వి.మహేష్ మాట్లాడుతూ.. దాతలు పాఠశాల అభివృద్ధికి ఆర్థికంగా తోడ్పాటు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, బి.భార్గవి, టి.రాధ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	4
వంకాయ	36		20
బెండకాయ	24	పాలకూర	3
పచ్చిమిర్చి	26		20
కాకర	26	చుక్కకూర	3
బోడ కాకర	160		20
బీర	30	తోటకూర	3
దొండ	30		20
పొట్లకాయ	36	గోంగూర	5
చిక్కుడు	46		20
గోరుచిక్కుడు	40	మెంతికూర	2
క్యాబేజీ	26		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		25
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	50		25
క్యాప్సికం	66	-ఖమ్మం వ్యవసాయం	

పైరవీలదే పైచేయి..!



- అధికారుల అండతో కార్పొరేషన్ కార్యాలయంలో తిష్ట
- డివిజన్లలో తగ్గిపోతున్న పారిశుద్ధ్య కార్మికులు
- అర్హతకు మించి పోస్టింగ్‌లు ఇస్తున్నారని అధికారులపై ఆరోపణలు
- కార్యాలయంలోనే 62 మంది విధుల నిర్వహణ

ఖమ్మంమయూరిసెంటర్: పైరవీలతో కాని పని లేదు అని నిరూపిస్తున్నారు కొందరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది. పైరవీలతో వచ్చిన వారికి కాలు కదలకుండా కార్యాలయంలో కూర్చునే పనిని అప్పగిస్తూ.. మిగతా వారిని డివిజన్లలో పనికి పంపుతున్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఈ పరంపర గత కొన్నేళ్లుగా కొనసాగుతూనే ఉంది. గత ప్రభుత్వ హయాంలోనూ రాజకీయ జోక్యంతో పోస్టింగ్‌లు ఇచ్చారన్న విమర్శలు బలంగానే వినిపించాయి. అయితే ఈ పరంపర ఇప్పుడు కూడా కొనసాగుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. అవసరం లేకపోయినా కార్యాలయంలో ఇబ్బడి ముబ్బడిగా నియామకాలు చేపడుతున్నారే తప్ప డివిజన్లలో తగ్గిపోతున్న పారిశుద్ధ్య సిబ్బందిని మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ఉన్న వారిపై పనిభారం పెరుగుతోంది. పారిశుద్ధ్య కార్మికుల స్థానంలో కొత్తగా ఔట్ సోర్సింగ్ విధానంలో ఎవరిని నియమించినా.. కార్యాలయంలోనే పోస్టింగ్ ఇస్తున్నారన్నా విమర్శలు ఇటీవల ఎక్కువయ్యాయి. కేఎంసీలో పలు కేటగిరిల్లో 1,013 మంది ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్నారు.

అర్హతలకు మించి పోస్టింగ్‌లు..

నచ్చిన పోస్టులో పని చేయాలంటే అర్హతలతో పని లేదు.. రాజకీయ పలుకుబడి, అధికారుల అండదండలు ఉంటే చాలు అనే చర్చ కేఎంసీలో నడుస్తోంది. పారిశుద్ధ్య విభాగంలో అయితే పలువురికి ఇన్‌చార్జ్ జవాన్‌లు, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు దక్కినట్లు తెలుస్తోంది. కేఎంసీ కార్యాలయంలో హోదాలు లేకుండానే 62 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది వివిధ విభాగాల్లో పని చేస్తున్నట్లు రిజిస్టర్లలో లెక్కలు చెబుతున్నాయి. ఏ విభాగంలో ఎవరు పని చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి అధికారులకు ఉంది.

అధికారుల అండ ఉంటే చాలు..

పారిశుద్ధ్య కార్మికుడు చనిపోయినా, అనారోగ్యం పాలైనా ఆయన స్థానంలో వారి కుటుంబ సభ్యులు పని చేసేందుకు అవకాశం కల్పిస్తారు. అనారోగ్యంపాలైన కార్మికుడి స్థానంలో మరో కార్మికుడిని తీసుకుంటే అతనితో పారిశుద్ధ్య పనులు చేయించాల్సి ఉంది. కాని కేఎంసీలో అధికారులు తమకు నచ్చితే చాలు వారిని కార్యాలయంలోకి తీసుకొచ్చి ఏదో ఒక పోస్టును క్రియేట్ చేసి అక్కడ నియమిస్తున్నారు. దీంతో డివిజన్లలో పని చేసే పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతుంది. ఓ పక్క పారిశుద్ధ్య పనులకు కార్మికులు సరిపోవడం లేదని కార్పొరేటర్లు ఆవేదన చెందుతుంటే.. కార్యాలయంలో మాత్రం పదుల సంఖ్యలో సిబ్బంది పని లేకుండానే ఖాళీగా కూర్చుని జీతాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కార్మికులు గ్రూప్ తీర్మానం చేసి ఇచ్చినా.. సిబ్బందిని నియమించుకోవడంలో వెనుకాడుతున్న అధికారులు మాత్రం నచ్చినట్లు పోస్టులు ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న వారి సంఖ్య ఇలా..	
పారిశుద్ధ్య కార్మికులు	548
ఫాగింగ్ వర్కర్లు	23
డ్రైవర్లు (ఆటో, ట్రాక్టర్, హెవీ వెహికిల్స్)	66
శానిటరీ జవాన్లు	48
గార్డెన్ వర్కర్లు	68
ఆఫీస్ స్టాఫ్	26
లైబ్రరీ	03
వాటర్ సప్లై వర్కర్లు	25
ఫొటో గ్రాఫర్	01
ఎలక్ట్రీషియన్లు	27
గార్డెన్ సూపర్‌వైజర్లు	04
కంప్యూటర్ ఆపరేటర్లు	25
వర్క్ ఇన్‌స్పెక్టర్లు	13
స్కిల్డ్ వర్కర్లు	07
డీఆర్‌ఎఫ్	20
టెక్నికల్ అసిస్టెంట్లు(ఎల్‌ఆర్‌ఎస్)	04
రిటైర్డ్ ఎంఆర్‌ఓ	01
రిటైర్డ్ హార్టికల్చర్ ఆఫీసర్	01
ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్	01
మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్	02

గ్రూపులు తీర్మానం చేసినా..

డివిజన్లలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు అనారోగ్యంతో విధుల నుంచి తప్పుకొని తమ కుటుంబ సభ్యులను పనిలో పెట్టేందుకు ఆయా డివిజన్లకు చెందిన కార్మికుల గ్రూపు తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఇలా చేస్తే కొత్త సభ్యుడి పేరును నమోదు చేస్తారు. అయితే 11 మంది వరకు పని నుంచి తప్పుకున్నా.. అధికారులు సంబంధిత ఫైల్‌ను పక్కనపెట్టినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పనులు చేసేవారు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు స్పందించకపోవడంపై కార్మిక సంఘాల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్య పనులకే తీసుకుంటాం..



పారిశుద్ధ్య విభాగంలో కార్మికులు ఎవరైనా పని నుంచి దిగిపోయినా, ప్రమాదంతో వైదొలిగినా వారి స్థానంలో తీసుకునే వారిని క్షేత్రస్థాయి పనులకే పంపిస్తున్నాం. కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది నియామకాలపై వస్తున్న ఆరోపణలను పరిశీలిస్తున్నాం. త్వరలోనే కమిషనర్‌తో కలిసి అన్ని చర్చించి ప్రక్షాళన చేస్తాం.

– పునుకొల్లు నీరజ, మేయర్, కేఎంసీ

పేదల వైద్యానికి ప్రభుత్వం భరోసా

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కూసుమంచి: చెక్కులు పొందిన లబ్ధిదారులతో మంత్రి పొంగులేటి

కూసుమంచి: పేదల వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ భరోసా కల్పిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన పలువురు లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పేదలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం రూ.10లక్షల వరకు వైద్యసేవలను ఉచితంగా అందించటమే కాకుండా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కూడా నిధులు అందిస్తుంన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మార్చురీ పరిశీలన..

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మార్చురీని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం పరిశీలించారు. మార్చురీలో సమస్యలపై ఆరా తీయగా ఫ్రీజర్ల కొరతను అధికారులు వెల్లడించడంతో రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఫోరెన్సిక్ వైద్యులు రాథోడ్ వినాయక్ పాల్గొన్నారు.

మంత్రికి వినతి..

నేలకొండపల్లి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలంలో పర్యటించిన సందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని, నేలకొండపల్లిలో హైవేకు ఎగ్జిట్, ఎంట్రీ అవకాశం కల్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు పగిడికత్తుల రామదాసు ఆధ్వర్యాన వినతి పత్రం అందించారు. అలాగే పసుమర్తి శ్రీనివాస్ ఆధ్వర్యాన ప్రారంభం కానున్న శ్రీభక్తరామదాసు అగర్‌బత్తి పోస్టర్లను ఆవిష్కరించారు. చెరువుమాధారం, నేలకొండపల్లి జన మండలి ఆధ్వర్యాన చేపడుతున్న కార్యక్రమాలను మంత్రికి వివరించారు. మరింతగా విస్తరించేలా సహకరించాలని కోరారు.

నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



శంకుస్థాపన చేస్తున్న మంత్రి నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: మురుగు నీరు పోయేందుకు నిర్మాణం చేసే డ్రెయిన్ పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్ ఐటీ హబ్ వద్ద రూ.2కోట్ల అంచనాలతో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ సమయంలోనే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా ముక్తార్, కార్పొరేటర్లు చావా మాధురినారాయణరావు, సరిపుడి రమాదేవిసతీష్, కమర్తపు మురళీ, చావా నారాయణరావు, మల్లీడి వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, పద్మజా రెడ్డి, స్వరూపరాణి, సాధు రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీకి మారుపేరు 'సిద్ధి'

ఖమ్మంమయూరిసెంటర్: నిజాయితీ, నిబద్ధతకు దివంగత సీపీఐ నేత సిద్ధి వెంకటేశ్వర్లు మారుపేరుగా నిలిచారని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సిద్ధి ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి పువ్వాడ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజా సమస్యల కోసం సిద్ధి పోరాడిన తీరును గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె.జానిమియా, తదితరులు పాల్గొన్నారు.

25న సదస్సు

ఖమ్మం లీగల్: ఈ నెల 25న హైదరాబాద్‌లో జరగనున్న ఓబీసీ అడ్వకేట్ల సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఓబీసీ అడ్వకేట్ కన్వెన్షన్ వారి ఆధ్వర్యాన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది బిచ్చాల తిరుమలరావు మాట్లాడుతూ.. దేశంలో కులగణన చేపడితేనే ఓబీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఓబీసీ అడ్వకేట్ కన్వెన్షన్ అధ్యక్షుడు వి.ఎం.కృష్ణ, ఎస్.నరేంద్రర్, భిక్షమయి, న్యాయవాదులు సుగుణరావు, జహీర్ అలీ, నర్సింహారావు, నాగేశ్వరరావు, షేక్.లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



కూసుమంచి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



తిరుమలాయపాలెంలో వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కూసుమంచి/తిరుమలాయపాలెం: ఎటువంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని సీపీఎం, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కూసుమంచిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించి తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే తిరుమలాయపాలెం మండల వ్యవసాయశాఖ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించి ఏపీజీవీబీ మేనేజర్ అన్వేష్, మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డిలకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా పార్టీ పాలేరు డివిజన్ ఇన్‌చార్జ్ బండి రమేష్, రైతు సంఘం మండల నాయకుడు కొలిచలం స్వామి మాట్లాడుతూ.. ప్రస్తుతం పంటల పెట్టుబడి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో రూ.2లక్షలకు పైన ఉన్న డబ్బులు కట్టాలని ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమని అన్నారు. రుణమాఫీ కాని రైతులకు వెంటనే మాఫీ చేసి వారికి కొత్త రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కూసుమంచి ధర్నాలో మండల కార్యదర్శి ఎడవెల్లి రమణారెడ్డి, తోటకూరి రాజు, బిక్కసాని గంగాధర్, గురుమూర్తి, రాధాకృష్ణ, కర్ణబాబు,వీరారెడ్డి, తదితరులు పాల్గొనగా.. తిరుమలాయపాలెం ధర్నాలో సీపీఎం మండల కార్యదర్శి శ్రీను, నాయకులు సురేష్, నాగేశ్వరావు, అశోక్, నాగేశ్వరావు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ధర్నా..

రఘునాథపాలెం: ఆంక్షలు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్‌తో నేడు(గురువారం) మండలంలోని మంచుకొండ ప్రధాన రహదారి జంక్షన్‌లో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు అజ్మీరా వీరునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏడీఏ బాధ్యతల స్వీకరణ

కూసుమంచి: వ్యవసాయ శాఖ కూసుమంచి డివిజన్ ఏడీఏ(సహాయ సంచాలకులు)గా నియమితులైన సరిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీఏ విజయచందర్ మధిరకు బదిలీ కాగా జేడీఏ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సరిత కూసుమంచికి వచ్చారు. ఈమేరకు ఏఓలు, ఏఈఓలు, ఇతర సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నియామకాలు

నేషనల్ లేబర్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ డైరెక్టర్‌గా కుంచపు వెంకటేశ్వర్లు



కుంచపు వెంకటేశ్వర్లు

ఖమ్మం మామిళ్లగూడెం: నేషనల్ లేబర్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ డైరెక్టర్‌గా ఖమ్మం త్రీటౌన్‌కు చెందిన కుంచపు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ చైర్మన్ ఎస్‌ఆర్ కుశలకర్, వైస్ చైర్మన్ కాశీపేట లింగయ్యలు ఢిల్లీలో జరిగిన సమావేశంలో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర సహకార సంఘాల భావ వ్యాప్తికి తన వంతు కృషి చేస్తామన్నారు.అనంతరం పలువురు ఆయనను అభినందించారు.

డీఎల్‌పీఓగా రాంబాబు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీఓ)గా రాంబాబును నియమిస్తూ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాంబాబు ప్రస్తుతం కల్లూరు డీఎల్‌పీఓగా పనిచేస్తున్నారు. ఖమ్మం డీఎల్‌పీఓగా పనిచేస్తున్న ప్రభాకర్‌ను కల్లూరుకు బదిలీ చేశారు. కాగా, రాంబాబు నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు విద్యుత్ కోత

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని జమ్మిబండ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-3 ఏఈ బి.తావుర్యా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో వైరారోడ్, సీక్వెల్ రోడ్, ఓల్డ్ కలెక్టరేట్ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అల్లీపురంలో వైద్య శిబిరం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 15వ డివిజన్ అల్లీపురంలో మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యాన వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు వైద్యులు తెలిపారు. పల్లె దవాఖానా వైద్యురాలు సాయిశ్రీ, ఏఎన్‌ఎంలు రాధ, లక్ష్మి, కార్పొరేటర్ రావూరి కరుణసైదబాబు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముఫ్వా పద్మావతికి పలువురి నివాళి

ఖమ్మంసహకారనగర్: ప్రముఖ కవి, విద్యావేత్త ముఫ్వా పద్మావతికి ప్రముఖులు నివాళులర్పించారు. రంగయ్య ఫౌండేషన్ చైర్మన్ ముఫ్వా శ్రీనివాసరావు మాతృమూర్తి పద్మావతి ఇటీవల మృతి చెందగా..నగరంలోబుధవారం ఆమె సంస్మరణ సభ నిర్వహించారు. ఈమేరకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సాగునీటి పారుదల కార్పొరేషన్ చైర్మన్ ముఫ్వా విజయబాబులు ఆమెకు నివాళులర్పించారు. అంతేకాక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మేయర్ పునుకొల్లు నీరజతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు సంద్ర వెంకటవీరయ్య, బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, తుళ్లూరి బ్రహ్మయ్య, చింత నిప్పు కృష్ణ చైతన్య, పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, బాగం హేమంతరావు, పోటు రంగారావు, తదితరులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారుడు మోదుగు గోవిందు ముఫ్వా పద్మావతి గురించి ఆలపించిన పాటలు పలువురి హృదయాలను బరువెక్కించాయి.

సీఐటీయూలో మార్కెట్ హమాలీల చేరిక



సంఘంలో చేరిన హమాలీలతో నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని బైపాస్‌రోడ్డులో గల కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీలు బుధవారం సీఐటీయూలో చేరారు. సీఐటీయూ ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎం.సాయిబాబా హమాలీలను సంఘంలోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్మికుల పక్షాన పోరాడుతున్న సంఘంగా గుర్తింపు ఉండడంతోనే ప్రతి రంగంలో సీఐటీయూకి మద్దతు లభిస్తుందన్నారు. కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీలకు సరైన వేతనం వచ్చేలా సీఐటీయూ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కల్యాణం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, భూక్యా శ్రీనివాసరావు, బండారు యాకయ్య, బోడపట్ల సుదర్శన్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



మృతదేహం వద్ద ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: గతవారం రోజుల క్రితం ఖమ్మం రైల్వే పోలీస్ పరిధిలోని బోనకల్, మోటమర్రి స్టేషన్ల మధ్యలో సుమారు 35 ఏళ్ల పురుషుడు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని రైల్వే పోలీసులు ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతదేహం కోసం ఎవరూ రాకపోవడంతో అనాథ శవంగా భావించి, రైల్వే పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి అంత్యక్రియల నిమిత్తం అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు, వైద్యశాల సిబ్బంది సమక్షంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరప్రదేశ్ యువకుడి అప్పగింత

ఖమ్మంఅర్బన్: గత నెల 5వ తేదీన ఖమ్మం రైల్వేస్టేషన్‌లో 20 ఏళ్ల మతిస్థిమితం లేని ఓ యువకుడు ప్లాట్‌ఫాం మీద ప్రయాణికులను బెదిరిస్తూ ఇబ్బంది కలిగిస్తుండగా.. రైల్వే పోలీసుల సమాచారం మేరకు అన్నం సేవా ఫౌండేషన్‌కు తీసుకొచ్చారు. ఆ తర్వాత ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన మమతా ఆస్పత్రిలో చికిత్స అందించగా.. కోలుకుని తన వివరాలు వెల్లడించాడు. తన పేరు మొహమ్మద్ షాజాద్ అని, తన ఊరు ఉత్తరప్రదేశ్‌లోని గొండా జిల్లా కాట్రా గ్రామమని చెప్పి తన అన్న ఫోన్ నంబరు చెప్పడంతో వారికి ఫోన్ చేసి ఆశ్రమానికి రప్పించారు. అనంతరం ఆ యువకుడిని అప్పగించగా.. 40 రోజుల తర్వాత తన తమ్ముడి జాడ తెలిసిందని పేర్కొంటూ శ్రీనివాసరావుకి కృతజ్ఞతలు తెలియజేశాడు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని డిమాండ్ చేస్తూ మాలమహానాడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన భారత్ బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా దుకాణాలు, బ్యాంకులు, పాఠశాలలను మూసి వేయించారు. పలు చోట్ల ధర్నా,రాస్తారోకోలు నిర్వహించి వినతిపత్రాలు సమర్పించారు. ప్రధాన సెంటర్లలో రోడ్లను దిగ్బంధనం చేయించారు. రిజర్వేషన్ ఎత్తివేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని, 341, 342 ఆర్టికల్స్‌ను యథావిధిగా కొనసాగించాలని, క్రీమీలేయర్ విధానాన్ని రద్దు చేయాలని, కులగణన చేపట్టాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



కూసుమంచి: ఎస్‌బీఐను మూసి వేయిస్తున్న మాలమహానాడు నాయకులు



నేలకొండపల్లి: తహసీల్‌లో వినతి పత్రం అందిస్తున్న నాయకులు



ఖమ్మం మామిళ్లగూడెం: భారత్ బంద్‌లో పాల్గొన్న మాల మహానాడు నాయకులు



తిరుమలాయపాలెం: రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న నాయకులు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824
ఖమ్మం ఎన్.ఉపేందర్ - 99591 24151
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990
వైరా ఐ. రాందాస్ - 98898 81843
రమేష్, ACO - 9059115968
మధిర వీరబాబు - 98498 64638
సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957